క్లుప్తంగా

ఎన్టీపీసీ ఉద్యోగులకు ఐఎన్టీయూసీ అండ



మాట్లాడుతున్న బాబర్ సలీంపాషా

జ్యోతినగర్: దేశవ్యాప్తంగా ఉన్న ఎన్టీపీసీ సంస్థల ఉద్యోగులకు ఐఎన్టీయూసీ అండగా ఉంటుందని ఐఎన్టీయూసీ అధ్యక్షుడు బాబర్ సలీంపాషా అన్నారు. బుధవారం ఒడిశాలోని కన్హా ఎన్టీపీసీ ప్రాజెక్టులో జరిగిన ఐఎన్టీయూసీ అనుబంధ ఆల్ ఇండియా ఎన్టీపీసీ వర్కర్స్ ఫెడరేషన్ ఏడో వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సంస్థ మనుగడకు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యూనియన్ కృషి చేస్తుందన్నారు. జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి మార్గదర్శనంలో యూనియన్ పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆయా ప్రాజెక్టుల్లో ఉద్యోగుల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడమే ప్రత్యేక ఎజెండా అని వివరించారు. సమావేశంలో ఎన్టీపీసీ రామగుండం ఉద్యోగ గుర్తింపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి ఆరెపల్లి రాజేశ్వర్ పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న కాలనీవాసులు

మంథని: మున్సిపల్ పరిధిలోని లైబ్రరీ ఏరియాలో వారంరోజుల నుంచి లోవోల్టేజీ విద్యుత్ సరఫరా కారణంగా అసౌకర్యం కలుగుతోందని కాలనీవాసులు స్థానిక సబ్ ఇంజనీర్‌కు వినతిపత్రం అందించారు. విద్యుత్ ఉపకరణాలు సరిగ్గా పనిచేయడం లేదని, అసలే ఎండాకాలం కావడంతో రాత్రివేళలో ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. గౌడ్స్ వీధిలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ మంజూరై నిర్మాణ పనులు ప్రారంభమైనా పూర్తి చేయడం లేదని, వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన

పాలకుర్తి: బసంత్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం కన్నాల టోల్‌ప్లాజా వద్ద హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బసంత్‌నగర్ ఎస్సై స్వామి పాల్గొని వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్, హెల్మెట్ వినియోగం గురించి వివరించారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, వాహనానికి సంబంధించి పూర్తిస్థాయిలో పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. అదేవిధంగా బైక్ డ్రైవింగ్ సమయంలో తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలన్నారు. ఎస్సై శివాణిరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌గౌడ్, కానిస్టేబుల్లు సురేశ్, కొమురయ్య, రమేశ్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న పండితులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో పంచలోహ విగ్రహ ప్రతిష్ఠాపన ప్రథమ వార్షిక వేడుకల్లో భాగంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన గురుస్వామి శ్రీఆద్దెంకి సారంగచారి ఆధ్వర్యంలో కేరళకు చెందిన శ్రీబ్రహ్మశ్రీ సజీవ్ నంబూద్రి గురుస్వామి బృందంతో లోధిన్ శాంతి ఆధ్వర్యంలో ఉదయం హోమాలు నిర్వహించారు. 108 కలశాలతో శ్రీఅయ్యప్పస్వామి మూల విరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ శిఖర సంప్రోక్షణ చేశారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

జూలపల్లి: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటేనే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని మండల వైద్యాధికారి సంపత్ రెడ్డి సూచించారు. మండలంలోని పెద్దాపూర్‌లో గర్భిణులకు పౌష్టికాహారం, నెలవారీ పరీక్షలు, మందుల వాడకం, సాధారణ ప్రసవంపై అవగాహన కల్పించారు. ప్రతినెలా గర్భిణులు ఆరోగ్య కేంద్రానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని, రక్త పరీక్షలు చేయించుకుని మందులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌వీ వసంత, ఏఎన్ఎం రుక్మిణి, కార్యదర్శి పున్నమయ్య ఉన్నారు.

శిథిలావస్థలో 'గుండారం' తూములు

- భారీ వర్షాలు కురిస్తే రిజర్వాయర్ కట్ట తెగిపోయే ప్రమాదం
- తూతూమంత్రంగా తాత్కాలిక మరమ్మతు చేస్తున్న అధికారులు
- ఆందోళన చెందుతున్న రైతులు



శిథిలావస్థలో పంట పొలాలకు సాగునీరందించే తూము

కమాన్‌పూర్: మండలంలోని గుండారం రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలోని గుండారం, రాజాపూర్ శివారులోని పంట పొలాలకు సాగునీరందించే రెండు తూములు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. తూములకు సంబంధించి సైడ్‌వాల్స్ కూలిపోయాయి. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

భారీ వర్షాలు పడితే కట్టకు ప్రమాదం..

రిజర్వాయర్ నుంచి సాగునీరు అందించే నడిమి తూముకు సంబంధించిన సైడ్‌వాల్స్ గోడలు కూలిపోవడంతో భారీ వర్షాలు పడిన సమయంలో రిజర్వాయర్ కట్ట కోతకు గురువుతుండడంతో కట్టతెగిపోయే ప్రమాదం ఉంటుందని రైతులు అంటున్నారు.

గతేడాది తాత్కాలిక మరమ్మతు

గతేడాది భారీ వర్షాలు పడిన నేపథ్యంలో మధ్య తూము వద్ద కట్ట కొంతమేర కోతకు గురికావడంతో సంబంధిత అధికారులు వచ్చి ఇసుక బస్తాలతో తాత్కాలిక మరమ్మతు మాత్రమే చేపట్టారు.

రిజర్వాయర్ ఆధునీకరణపై నీలినీడలు

మండలంలో మంథని నియోజకవర్గంలోని కమాన్‌పూర్, రామగిరి, మంథని, ముత్తారం మండలాలకు వరప్రదాయనిగా పేరుగాంచి పంటలకు సాగునీరందించే కల్పతరువు గుండారం రిజర్వాయర్ ఆధునికీకరణపై ప్రభుత్వం, అధికారులు దృష్టిసారించడం లేదు. కమాన్‌పూర్ మండలంలోని గుండారం శివారులో 1979లో ఎస్సారెస్పీ అనుసంధానంగా గుండారం రిజర్వాయర్ ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టి 175 ఎకరాలు తీసుకొని 1982లో ప్రాజెక్టును పూర్తి చేశారు. రిజర్వాయర్ ఆయకట్టు కింద ఉన్న భూములకు సాగునీరందిండానికి ఆర్ఎస్‌బీ కెనాల్ ఏర్పాటు చేసి సాగునీటిని అందిస్తుండడంతో వేల ఎకరాల బీడు భూములు సాగులోకి వచ్చాయి.

పేరుకుపోతున్న పూడిక..

గుండారం చెరువును రిజర్వాయర్‌గా మార్చినప్పటి నుంచి నేటి వరకు పూడిక తీయకపోవడంతో రిజర్వాయర్‌లో పూడిక నిండిపోవడంతో నీటి సామర్థ్యం తగ్గుతోంది. కట్ట తెగుతుందని భయపడుతున్నారు.

కట్ట తెగుతుందని భయపడుతున్నారు



గుండారం రిజర్వాయర్ నుంచి నడిమి తూముతో పొలాలకు నీటిని అందిస్తున్న తూములకు సంబంధించిన సైడ్‌గోడలు కూలిపోయాయి. వర్షాలు బాగా పడితే కట్ట తెగుతుందని రైతులు భయపడుతున్నారు. – గాజుల శ్రీనివాస్, గుండారం

మరమ్మతు చేయించాలి



గుండారం రిజర్వాయర్ నుంచి పంట పొలాలకు సాగునీరందించడానికి రెండు తూములు ఉన్నాయి. రెండు తూములు పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలిపోయాయి. గతేడాది అధికారులు వచ్చి తాత్కాలిక మరమ్మతు మాత్రమే చేశారు. రిజర్వాయర్‌కు ఎలాంటి ప్రమాదం జరగక ముందే తూములకు మరమ్మతు చేయించాలి. – ఆకుల ఓదెలు, మాజీ సర్పంచ్, గుండారం

పనులు చేపడతాం

గుండారం రిజర్వాయర్ నుంచి ఆయకట్ట కింద సాగు చేస్తున్న పంట పొలాలకు సాగునీరు అందించే రెండు తూములు శిథిలావస్థకు చేరాయని మా దృష్టికి రావడంతో నిధుల మంజూరికి ప్రతిపాదనలు పంపించాము. నడిమి తూము మరమ్మత్తుల కోసం రూ. 13లక్షలు మంజూరైనాయి, ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో పనులు ప్రారంభించలేదు. కోడ్ ముగిశాక నడిమితూముకు మరమ్మత్తులు చేపడుతాం. – రాజేందర్, ఐబీ డీఈ

భద్రతతో లక్ష్యాలను సాధించాలి



సమావేశంలో ఈఅండ్ఎం డైరెక్టర్ సత్యనారాయణ

రామగిరి: యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి, నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించాలని ఈఅండ్ఎం (ఎలక్ట్రికల్ అండ్ మెకానికల్) డైరెక్టర్ డి.సత్యనారాయణరావు అన్నారు. బుధవారం ఆర్జీ–3 పరిధిలోని ఏపీఏ గనిని ఆయన సందర్శించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. లాంగ్‌వాల్, 3వ, 4వ సీమ్‌ల పనుల పురోగతిపై చర్చించి 3వ సీమ్‌లో నడిచే పనులను పరిశీలించారు. యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి, నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి తగిన చర్యలు, ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి కె.నాగేశ్వర్‌రావు, ఏరియా ఇంజనీర్ బి.సీతారామం, ప్రాజెక్టు ఇంజనీర్ టి.రఘురాం, పర్సేస్ డీజీఎం పి.డి.సుధాకర్, ఎస్‌వోఎం కె.జనార్దన్ పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలు విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఆర్జీ–3 జీఎం ఎస్.సుధాకర్‌రావు

రామగిరి: ఆర్జీ–3 ఏరియాలో జూన్2న నిర్వహించనున్న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని ఆర్జీ–3 జీఎం ఎస్.సుధాకర్‌రావు అన్నారు. బుధవారం ఆర్జీ–3 జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జూన్ 2న అన్ని గనులు, విభాగాల్లో ఉదయం జాతీయ పతాకం ఎగురవేయాలన్నారు. అనంతరం రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగాణం ఎదుట గల అమరవీరుల స్తూపానికి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళి అర్పించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే క్రీడాప్రాంగాణంలో సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎంలు జి.రఘుపతి, బి.సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ పి.ఎలీషా, ప్రాజెక్టు అధికారి ఎస్.రాధాకృష్ణ, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, సివిల్, ఐఈడీ డీజీఎంలు పద్మరాజు, కె.చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి, ఏరియా సర్వే అధికారి పి.జనార్దన్ రెడ్డి, ఏరియా సెక్యూరిటీ అధికారి ఈ.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

'సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు చందర్‌కు లేదు'

గోదావరిఖని: రామగుండం ప్రజల సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు లేదని కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ మహంకాళి స్వామి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏం చేశారని ప్రశ్నించారు. గతంలో ఈ ప్రాంతంలో మురుగునీరు నేరుగా గోదావరినదిలో కలవకుండా ఎస్టీపీలు కట్టాలని అనేకసార్లు ధర్నా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలలకే ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ సింగరేణి సీఅండ్ఎండీ బలరాం, డైరెక్టర్లతో మాట్లాడి ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ 20 ఎంఎల్‌డీ పనులు ప్రారంభించారన్నారు. అమృత్ స్కీం కింద దాదాపు రూ.250 కోట్లతో నాలుగు ఎస్టీపీలను కట్టడానికి టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందన్నారు. రామగుండం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



యైటింక్లయిన్‌కాలనీ: కాలనీలో శోభాయాత్ర



జ్యోతినగర్: బైక్ ర్యాలీలో స్వాములు



సుల్తానాబాద్: శోభాయాత్రలో స్వాములు

యైటింక్లయిన్‌కాలనీ: హనుమాన్‌స్వామి పెద్ద జయంతిని పురస్కరించుకొని రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ హనుమాన్‌నగర్‌లోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయం నుంచి బుధవారం రాత్రి హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, హనుమాన్ దీక్ష సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: పట్టణంలోని మార్కండేయకాలనీలో ఉన్న పెరిక గిద్దె హనుమాన్ ఆలయం నుంచి గురువారం సాయంత్రం ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల రామేశ్వరరావు పూజారి అభిరామ్ శోభాయాత్ర ప్రారంభించారు. పలు కాలనీల్లో దీక్షాస్వాములు జైశ్రీరామ్, జైహనుమాన్ నినాదాలు చేశారు.

జ్యోతినగర్: జయ హనుమాన్.. జయ జయ హనుమాన్ అంటూ హనుమాన్ మాలధారణ స్వాములు బైక్ ర్యాలీ చేపట్టారు. బుధవారం ఎన్టీపీసీ రామగుండం రింగ్ రోడ్ ఆంజనేయ స్వామి ఆలయం నుంచి స్వాములు జై హనుమాన్ అంటూ కాషాయ జెండాలతో భారీగా ర్యాలీ చేపట్టారు. ర్యాలీ ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ నుంచి మేడిపల్లి సెంటర్ వరకు, అక్కడి నుంచి ఆలయం వరకు నిర్వహించారు. ఆలయ అర్చకులు గోపినాథ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సింగరేణి సర్వేను అడ్డుకున్న వ్యక్తి అరెస్ట్

గోదావరిఖని: స్థానిక శివాజీనగర్‌లో సర్వే నిర్వహిస్తున్న సింగరేణి సర్వే అధికారులను అడ్డుకున్న తోట వేణును అరెస్ట్ చేసినట్లు గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. సింగరేణి అధికారుల విధులను అడ్డుకున్నారన్న ఆర్జీ–1 జూనియర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ అక్బర్ అలీ ఫిర్యాదు చేశారు. కాగా కేసు నమోదు చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

అనారోగ్యంతో ఎన్టీపీసీ పర్మినెంట్ ఉద్యోగి మృతి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు పర్మినెంట్ ఉద్యోగి డి.ప్రభాకరచారి(59) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో సీఅండ్ఐ మెయింటినెన్స్ విభాగంలో విధులు నిర్వహించడంతో పాటు స్పోర్ట్స్ కమిటీ సభ్యులుగా కొనసాగుతూ పీటీఎస్‌లో ఉంటున్నారు. ఇటీవల అనారోగ్యం బారిన పడటంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

తప్పిన అగ్ని ప్రమాదం

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ చెరువు కింద పొలాల్లో బుధవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. ధాన్యం కుప్పలు పొలాల్లోనే ఉండగా అకస్మాత్తుగా మంటలు అంటుకోవడంతో గమనించిన గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే వచ్చిన అగ్నిమాపక యంత్రం మంటలు ఆర్పడంతో ప్రమాదం తప్పింది. సంఘటన వద్ద సంకెన్ల లక్ష్మన్, సీపెల్లి అంజయ్య, రవి, మామిడిపెల్లి శేఖర్, రమేశ్, చామనపెల్లి రాజు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండు గేదెలు మృతి

సుల్తానాబాద్: పట్టణ పరిధిలో ఉన్న పూసాలలో రాజీవ్ రహదారిపై గుర్తు తెలియని వాహనం రెండు గేదెలను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాయని కౌన్సిలర్ గుర్రాల శ్రీనివాస్ తెలిపారు. మున్సిపల్ సిబ్బందికి సమాచారం ఇచ్చి క్రేన్ సాయంతో కార్మికులతో కలిసి శ్మశాన వాటికలో పూడ్చివేసినట్లు ఆయన తెలిపారు. రెండు గేదెలు రూ.రెండు లక్షల విలువ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

హరితహారంలో ప్రజలను భాగస్వాములను చేయాలి

రామగుండం: అంతర్గాం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో ఎం.ఏ.అలీం ఆధ్వర్యంలో వారాంతపు సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాతో పాటు హరితహారం కార్యక్రమం విజయవంతం చేసేందుకు మొక్కలు నాటే కార్యక్రమానికి గ్రామస్థాయిలో ప్రజలను భాగస్వాములను చేసేలా కసరత్తు చేయాలని ఆదేశించారు. ఎంపీవో అబ్దుల్ వాజిద్, ఈజీఎస్ ఏపీవో రమేశ్, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేత్రదానం అన్నిదానాల కంటే గొప్పది

కోల్‌సిటీ: అన్నిదానాల కంటే నేత్రదానం మహాపుణ్యకార్యమని రామగుండం నగరపాలక సంస్థ 42వ డివిజన్ కార్పొరేటర్ బాలరాజ్ కుమార్, సదాశయ ఫౌండేషన్ జాతీయ గౌరవ అధ్యక్షుడు, కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్.లింగమూర్తి, ప్రచార కార్యదర్శి కే.ఎస్. వాసు, లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎస్.శంకర్ అన్నారు. గోదావరిఖని కల్యాణ్‌నగర్‌కు చెందిన బైన లలిత బాయి ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. బుధవారం నేత్రదాత సంస్మరణ సభను సదాశయ ఫౌండేషన్, కమాన్ పూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం నేత్ర, అవయవ, దేహ దానంపై అవగాహన కల్పించారు. అనంతరం నేత్ర దాత భర్త లక్ష్మణ్ సింగ్, కుమారులు పవన్ సింగ్, శ్యామ్ సింగ్‌ను సత్కరించి, అభినందన పత్రం అందజేశారు. బైన జైసింగ్, ప్రతాప్‌సింగ్, రఘుసింగ్, లావణ్యబాయి, కీర్తిబాయి, శంకర్‌సింగ్, బాలజీసింగ్, కిషన్‌సింగ్, విజయ్‌సింగ్ పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గర్రెపల్లి చెరువు కట్టపై బుధవారం కోతి చనిపోవడంతో చలించిన గీత కార్మికులు దాహన సంస్కారాలు నిర్వహించారు. కోతిని దైవంగా భావించి పాడె కట్టి అంత్యక్రియలు పూర్తిచేశారు. వెంకటేశం, అయిలయ్య, కొమురయ్య, కనకయ్య ఉన్నారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

ఓదెల: మండలంలోని గుంపుల గ్రామంలో రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేను గౌడసంఘం కమిటీ నాయకులు సన్మానించారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

రామగుండం: అంతర్గాం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీటీసీలు గైర్హాజరవడంతో వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో ఎం.ఏ.అలీం ప్రకటించారు. ఇప్పటికే సర్పంచుల పదవీకాలం ముగియడంతో మండల పరిధిలో కేవలం ఐదుగురు ఎంపీటీసీలు మాత్రమే కేవలం ఎంపీపీ దుర్గం విజయ మాత్రమే హాజరుకావడంతో కోరం లేక సమావేశం వాయిదా వేశారు. డిప్యూటీ తహసీల్దార్ సాయికిషోర్, మండల పరిషత్ సూపరింటెండెంట్ మామిడాల కరుణాకర్, ఎంపీవో అబ్దుల్ వాజిద్‌తో పాటు కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు, వివిధశాఖల మండల స్థాయి అధికారులు హాజరయ్యారు.

ప్యాసింజర్ రైళ్ల సమస్యలపై పీఎంవోకు ఫిర్యాదు



ఫ్యాక్స్ ద్వారా పీఎంవో, రైల్వే జీఎంకు చేసిన ఫిర్యాదు

రామగుండం: దక్షిణమధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో రాకపోకలు సాగించే ప్యాసింజర్ రైళ్లతో ప్రయాణికుల సమస్యలపై ఈ నెల 27న 'ప్యాసింజర్ రైళ్లు... నిర్లక్ష్యం ఎన్నేళ్లు?' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి స్పందించారు. బుధవారం ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్ ప్యాసింజర్ రైళ్లతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనాన్ని జోడిస్తూ ప్రధానమంత్రి కార్యాలయం, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు ఫ్యాక్స్ ద్వారా ఫిర్యాదు చేశారు.

ఘనంగా పోచమ్మతల్లికి బోనాలు



బోనాలతో మహిళలు

మంథని: మంథని మున్సిపాలిటీ పరిధిలోని శ్రీపాదకాలనీలో బోనాల పండుగ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఐదేళ్లకు ఒకసారి జరిగే బోనాల పండుగ ఉత్సవాలను రెండురోజులు నిర్వహించనున్నట్లు కాలనీవాసులు తెలిపారు. కాలనీ మహిళలు బోనాలతో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

ఇంటర్నేషనల్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



అభినందిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని గాయత్రీ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇండియన్ స్కూల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ బెంగుళూరు వారు నిర్వహించిన ఇంటర్నేషనల్ ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబరిచారు. ప్రతిభ చూపిన విద్యార్థులు నవదీప్, పెద్ది సాయితేజ, రెహాన్ కాంస్య పతకాలు సాధించగా, సముద్రాల అభినవ్, చాట్ల శ్రీమాన్, ఉట్నూరు చక్రికకు జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ బుధవారం ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీ, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై రవళి

కమాన్‌పూర్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమాన్‌పూర్ ఎస్సై–2 జక్కుల రవళి అన్నారు. రామగుండం కమిషనరేట్ పోలీస్ కళాబృందంతో కమాన్‌పూర్ ఎస్సై మామిడి చంద్రశేఖర్ మండలంలోని గుండారంలో కళాజాత కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు లైంగిక, వరకట్న వేధింపులు, గృహహింస, బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలు, ఆత్మహత్యలు, మత్తు పదార్థాల వినియోగం, మైనర్లు బైక్ నడపడం వల్ల కలిగే అనర్థాలపై ఎస్సై అవగాహన కల్పించారు. కళాజాత బృందం సభ్యులు శ్రీనివాస్, సదానందం, అమర్‌నాథ్, సత్యనారాయణ, రవీందర్, సంపత్, సమ్మయ్య, హెడ్ కానిస్టేబుల్స్ రహీం, తిరుపతి, జంపయ్య పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

ధర్మారం: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను బుధవారం మండల వ్యవసాయ అధికారి పూర్ణిమ, పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని విత్తనాల బస్తాలను తనిఖీ చేసి ఎరువుల రికార్డులను పరిశీలించారు. ఏవో పూర్ణిమ మాట్లాడుతూ కల్తీ విత్తనాలు విక్రయించిన దుకాణాల లైసెన్స్ రద్దుతోపాటు క్రిమినల్ కేసు నమోదు చేస్తామన్నారు. తనిఖీల్లో పోలీసులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ముత్తారం: మండలంలోని ఓడెడ్, ముత్తారంలోని ఎరువుల దుకాణాలను బుధవారం మండల వ్యవసాయాధికారి చిందం శ్రీకాంత్, హెడ్ కానిస్టేబుల్ మధునయ్య తనిఖీ చేశారు. ఎరువుల దుకాణాలో ధరల పట్టికను, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ఎరువుల దుకాణాదారులకు ఆదేశాలు జారీ చేశారు. నకిలీ ఎరువులు, విత్తనాలు అమ్మితే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

విత్తనాలు కొనేటప్పుడు రశీదు తీసుకోవాలి

కమాన్‌పూర్: రైతులు విత్తనాలు కొనేటప్పుడు డీలర్ నుంచి తప్పనిసరిగా రశీదు(బిల్లు) తీసుకోవాలని ఏఈవో అజ్మీరా సురేశ్ అన్నారు. మండలంలోని పేరపల్లి, ముల్కలపల్లిలో బుధవారం విత్తన కొనుగోలుపై రైతులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడారు. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని సూచించారు.

'ట్రినిటి' విద్యార్థినికి టీసీఎస్‌లో ఉద్యోగం



అభినందిస్తున్న అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ట్రినిటి ఇంజనీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ ఫైనలియర్ విద్యార్థిని సంజన టీసీఎస్ డిజిటల్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొని ఉద్యోగం సాధించడంపై అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్ అభినందించారు. బుధవారం కాలేజీలో జరిగిన కార్యక్రమంలో సంజనను ట్రినిటి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు మనోహర్‌రెడ్డి, చైర్మన్ ప్రశాంతరెడ్డి, ప్రిన్సిపాల్ మణిగణేషన్, హెచ్‌వోడీ స్వాతి అభినందించారు.

అంజన్నస్వాముల పాదయాత్ర

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కనుకుల నుంచి అంజన్నస్వాములు బుధవారం పాదయాత్ర ద్వారా కొండగట్టుకు బయలుదేరారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో పంచామృత అభిషేకం, చందనోత్సవం, పూజలు చేసుకొని ఇరుముడి కట్టుకొని దాదాపు 30మంది స్వాములు బయలుదేరారు. అయ్యగారు కాండూరి వాసు, స్వాములు ఉన్నారు.